“మా వార్డెన్ నన్ను ఎలాంటి చూపులు చూస్తుందో తెల్సా?” అంది సీత మళ్ళీ.

బుచ్చిబాబేం సమాధానం చెప్పలేదు. ఇద్దరు థియేటర్‌లోకి వెళ్ళి సీటు నెంబర్సు వెతుక్కుని కూర్చున్నారు.

“చెప్పు మనిద్దరం ఎప్పుడు పెళ్ళి చేసుకుందాం” అడిగింది సీత బుచ్చిబాబు చేతిని తన చేతిలోకి తీస్కుంటూ.

“నాకు కాస్త టైం కావాలి. ఇంకా మా అమ్మనాన్నలకు నీ గురించి చెప్పలేదు. వాళ్ళకి నీ గురించి చెప్పాలి. మన పెళ్లికి ఒప్పించాలి” అన్నాడు బుచ్చిబాబు తన రెండో చేతిని అమె చేతిమీద వేస్తూ.

“అప్పటికి మనిద్దరం ముసలి ఒగ్గులైపోతాము” తన చేతిని వెనక్కి లాగేస్కుంటూ చిరుకోపంతో అంది సీత.

బుచ్చిబాబు ఏమీ అన్లేదు. అప్పుడే లైట్స్ గుప్పున ఆరిపోయాయ్.

“నీతో సినిమాలకీ, షికార్లకి రావడం మానేస్తా..... అప్పుడు నీకు తిక్క కుదురుతుంది” మళ్ళీ సీతే అంది.

“ప్లీజ్ సీతా...కోపగించుకోకు. త్వరలో నిన్ను నా దాన్నిగా చేస్కుంటాగా? ప్లీజ్ నవ్వవూ?” సీత గడ్డాన్ని పట్టుకున్నాడు బుచ్చిబాబు .

“నవ్వాలి సీతా...ఏది?”

“నేను నవ్వుతూనే ఉన్నాను. ఈ చీకట్లో నీకు కనిపించి చస్తే కదా?” అంది సీత.

అడ్వ టైజ్‌మెంట్స్ మొదలయి అవి అయిపోయి సినిమా స్టార్టు అయ్యింది.

కథ చాలా పాతదే! ఒక హీరో...ఇద్దరు హీరోయిన్లు!! పాపం హీరో ఒక ప్రక్క పెళ్ళాం. మరో ప్రక్క ప్రేయసి. ఇద్దరి మధ్య నలిగిపోతూనే ఇద్దరితోనూ సంబరంగ చంకలు గుద్దుకుంటూ స్టెప్పులేస్తు డ్యూయేట్లు పాడేస్తున్నాడు. ఆ హీరో అభిమానులు పాట పాటకీ ఈలలువేస్తూ సీట్లోంచి లేస్తూ చిందులు వేస్తూ తెరమీదకి చిత్తు కాగితాలు వేస్తున్నారు.

“ఇదేం అభిమానము?! హీరో అంటే ఇష్టం అయితే తెరమీదకి పూలు విసరాలిగానీ ఇలా చిత్తు కాగితాలు విసరడం ఏంటీ?” ఆశ్చర్యంగా అడిగింది సీత.

బుచ్చిబాబు నవ్వుతూ “నో కామెంట్!” అన్నాడు.

ఓ ముప్పావుగంట గడిచింది. దీక్షగా సినిమా చూస్తున్న సీత భుజం మీద చెయ్యి పడింది. సీత పక్కకి తిరిగి బుచ్చిబాబు వంక చూసి నవ్వింది. బుచ్చిబాబు కూడా నవ్వి మళ్ళీ తెరవైపు మొహం తిప్పాడు. సీత భుజము మీద నుండి పైకి జరిగి ఆమె చెంపల్ని నిమిరింది.

“ఊ...ఇలాంటి పనులు చేయడానికి మాత్రము భయం లేదు” మనసులోనే అనుకుని ముసిముసిగా నవ్వింది సీత.

కొన్ని క్షణాలు గడిచిన తరువాత ఆ చేయి క్రిందకి జరిగి సీత కంఠాన్ని నిమిరింది ఆ తర్వాత మెల్లగా ఇంక క్రిందకి జరగసాగింది.

" బుచ్చిబాబూ .... దిసీజ్ టూ మచ్" అంటూ క్రిందకి జరుగుతున్న చేతిని చటుక్కున పట్టుకుని కెవ్వుమని అరిచింది సీత. అది బుచ్చిబాబు చెయ్యి కాదు.

సీతకి ఇటుప్రక్కన కూర్చున్నవాడు సర్దుకుని కూర్చున్నాడు.

"ఏంటి? ఏమైంది?" సీత మీదకి వంగుతూ అడిగాడు బుచ్చిబాబు.

"నా ప్రక్కవాడు నామీద చెయ్యేసాడు. అది నీ చెయ్యి అనుకున్నాను. అయినా అది నీ చెయ్యి కాదని చెప్పకుండా బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంటావేం?" విసుక్కుంది సీత బుచ్చిబాబు చెవిలో.

"బానే వుంది. ఎవడో చీకట్లో నీ మీద చెయ్యేస్తే అది నీకు తెలియాలిగాని నాకెలా తెలుస్తుంది సిల్లీగా?" బుచ్చిబాబు కూడా సీత చెవిలో అన్నాడు.

"సరే... కాస్త ఇటు జరిగి కూర్చో" అంటూ సీత భుజం చుట్టు చెయ్యేశాడు బుచ్చిబాబు .

మరో అయిదు నిముషాలు గడిచాయి. వెనుక వరుసలోవున్న వాళ్లలో ఎవడో కాలితో సీత వెనుక భాగాన్ని నొక్కడం మొదలు పెట్టాడు.

సీత సీట్లోంచి చివాలున లేచింది.

"ఏంటి... ఏమైంది?" అడిగాడు బుచ్చిబాబు సీట్లోంచి కూర్చునే.

"మనం పోదాం" బుచ్చిబాబు సమాధానము చెప్పకుండానే బయటకి పరుగుతీసింది సీత

బుచ్చిబాబు ఆమెని అనుసరించాడు.

"ఏంటి డియర్ ఏమైంది" అడిగాడు బుచ్చిబాబు .

"ఎవడో రాస్కెల్ వెనుక కాలేసి నొక్కుతున్నాడు ఛీ ఛీ... ఇంకెప్పుడూ ఈ అలగా జనాలు చూసే సినిమాలకు నేను రాను" విసుగ్గా అంది సీత .

"వెధవలు...పోదాం పద" అన్నాడు బుచ్చిబాబు .

"పోదాంలేగానీ ఇందాక వాడెవడో నామీద చెయ్యేసాడని చెప్పినా నీలో ఏం రియాక్షన్ లేదేం? వాడిని పట్టుకుని నిలదీయొద్దూ?"

"ఎందుకిలే సిల్లీగా అనవసరమైన గొడవనీ...." నసిగాడు బుచ్చిబాబు .

"అవును... నీకిది సిల్లీగానే అనిపిస్తుంది. ఎందుకంటే ప్రస్తుతం నేనేం కానుగా? అదే నేను నీ భార్య నై వుండీ నామీద ఎవడో చెయ్యేస్తే నువ్విలాగే ఊర్కుంటావా?" ఉక్రోషంగా అడిగింది సీత . అలా అడుగుతున్నప్పుడు ఆమె కళ్ళలో నీళ్ళు ఉబికాయి.

బుచ్చిబాబుకి పౌరుషం వచ్చింది.

"ఉండు..నీ మీద చెయ్యేసిన వాడి పని, నిన్ను కాలితో నొక్కిన వాడి పనీ ఇప్పుడే పట్టేస్తా " అని సీతని అక్కడే ఒంటరిగా వదిలేసి థియేటర్‌లోకి ఆవేశముగా వెళ్ళాడు బుచ్చిబాబు.

పావు గంట గడచిన తరువాత బుచ్చిబాబు రేగిన జుట్టుతో చిరిగిన ఫ్యాంటూ షర్టుతో బయటకి వచ్చాడు.

"ఏంటిది? ఏమైంది??" కంగారుగా అడిగింది సీత .

“కనబడ్డంలేదూ...తన్నారు!” నీరసంగా అన్నాడు బుచ్చిబాబు .

“అదేంటి..నాతో మిస్ బిహేవ్ చేసింది కాకుండా అడిగిన నిన్ను కూడా తన్నారా?”

“తన్నింది వాళ్లు కాదు”

“నీతో మిస్ బిహేవ్ చేస్తున్న వారితో వాదిస్తుంటే ఈ సినిమా హీరో అభిమానులు తన్నారు”

“అదేంటి? ఈ విషయముతో వాళ్ళకేం సంబంధం?” ఆశ్చర్యంగా అడిగింది సీత.

“వాళ్ల అభిమాన హీరో సినిమాని చూడనివ్వకుండా గొడవ చేసానని వాళ్లకి సిల్లీగా కోపం వచ్చింది”

పళ్ళు కొరికాడు.

0 0 0

పర్వతాలరావ్ టివీ చూస్తున్నాడన్న మాటేగాని ఆయన ధ్యాస టివీ మీద లేదు. మాటిమాటికి గోడ గడియారం వంక చూస్తున్నాడు. ఆయన్ని పార్వతమ్మ గమనిస్తూనే వుంది. ఆయన మనసులోని ఆలోచనలే ఆవిడ మనసులో కూడా వున్నాయి.

చివరికి ఆవిడే అంది “ఆఫీసు అయిదు గంటలకే అయిపోతుంది కదా. అయినా వీడింకా ఇంటికి రాలేదేంటో!”

“ఫ్రెండ్స్‌తో తిరుగుళ్ళు ఎక్కువయ్యాయ్. పింజారీ వెధవ!” కస్సున లేస్తూ అన్నాడు పర్వతాలరావ్.

“పాపం తిట్టకండి”

“తిడ్తానా చీరేస్తానా వెధవన్నర వెధవ! రోజూ అర్థరాత్రిదాక వీడు రోడ్డుమీద వెలగబెట్టే రాచకార్యం ఏమిటో?”

“అందుకే వాడికి త్వరగా పెళ్ళి చేసేద్దామండి. అప్పుడైనా ఇంటిపట్టున వుంటాడని నేను మొత్తుకునేది” నెత్తి కొట్టుకుంటూ అంది పార్వతమ్మ.

“అందుకేగా రేపు పిచ్చికవారి అమ్మాయిని చూడ్డానికి వెళ్తున్నాం. పిల్ల నచ్చితే వెంటనే తాంబూలాలు పుచ్చేస్కుని పెళ్ళి చేసేయడమే! రేపు ఈ సన్నాసి వెధవని ఆఫీసు నుండి తిన్నగా ఇంటికి రమ్మను”.

“పాపం తిట్టకండి. నేను వాడికి చెప్తాగా? రేపు మనం పిల్లని చూడ్డానికి వెళ్తున్నామే వాళ్ల ఇంటిపేరు పిచ్చిక. అయినా పిల్లలు మాత్రం ఏనుగుల్లా ఉంటారట కదండీ?”

“ఎవడలా కూసిన తింగరి వెధవ? మనుష్యులకి పుట్టినవాళ్ళు ఏనుగుల్లా ఎందుకుంటారు? ఏదో కాస్త బొద్దుగా వుంటారేమో...... అంతే”

పర్వతాలరావు ఇలా అంటుండగానే బుచ్చిబాబు లోపలికొచ్చాడు. బుచ్చిబాబుని ఏదో అనాలని అనుకుని అతన్ని చూసి పర్వతాలరావు అలాగే నోరు తెరుచుకుని కొన్ని క్షణాలపాటు వుండిపోయాడు. పార్వతమ్మ పరిస్థితి అంతే.

ముందుగా పర్వతాలరావు తేరుకున్నాడు.

“ఏంట్రా వెధవాయ్ ఆ వాలకం. ఆ చిరిగిపోయిన డ్రస్సేంటీ, ఆ రేగిపోయిన జుట్టేంటి ....... ఏ జులాయ్ వెధవతోనైనా కుస్తీ పట్లుగానీ పట్టావా?” అన్నాడు పర్వతాలరావు.

“ఏంటి నాన్నా మరీ సిల్లీగా? నేనేమైనా స్ట్రీట్ రౌడీనా రోడ్లమీద కుస్తీపట్లు పట్టడానికి. ఏదో చిన్న యాక్సిడెంట్ అంతే!” అన్నాడు బుచ్చిబాబు నేలచూపులు చూస్తూ.

“బాబూ...” పార్వతమ్మ ఒక్క పెట్టున గావుకేక పెట్టింది. తరువాత చెంగున బుచ్చిబాబు “నీకేం కాలేదు కదా బాబు.. చెప్పు బాబూ” అంది.

“ఏమైనా అయితే ఇంటికెలా వస్తాను... మరీ సిల్లీగా సినిమా తల్లిలా ఓవర్ యాక్షన్ చెయ్యకు. రోడ్డు దాటుతుంటే ఎవడో మోటార్ సైకిల్‌తో గుద్దాడు, పెద్ద దెబ్బలేం తగల్లేదు” అన్నాడు బుచ్చిబాబు.

“అది సరేనోయ్... మరి ఇంటికి రావడం ఇంతాలశ్యం అయిందేం?” కోరగా చూస్తూ అడిగాడు పర్వతాలరావు.

“ఆఫీసులో పనెక్కువుంటేనూ?” నసిగాడు బుచ్చిబాబు.

“ఉంటుంది వుంటుంది వెధవాఫీసు. పెళ్ళి చేసేస్తే ఆఫీసులో నిజంగా పనివున్నా ఎగ్గొట్టి ఇంటికి త్వరగా తగలడ్తావ్.”

“అన్నట్టు రేపు నీకు పెళ్ళి చూపులు బాబూ .... ఆఫీసు నుండి ఇంటికి త్వరగా వచ్చేయ్” అంది పార్వతమ్మ.

“ఊహూ ... పెళ్ళి చూపులు నాకొద్దు, అయినా నన్నడక్కుండా పెళ్ళి చూపులు ఎవరు పెట్టమన్నారు సిల్లీగా!?” బుంగమూతి పెట్టాడు బుచ్చిబాబు .

“నిన్నడగడమేంటోయ్ వెధవాయ్... నేను వస్తామని వాళ్ళకి మాటిచ్చా. నోరు మూస్కుని మాతోరా.. లేకపోతే మా అబ్బాయి సంసారానికి పనికిరాడని నేనే పనిగట్టుకుని ప్రతి వెధవ దగ్గరా ప్రచారం చేసేస్తా ... అప్పుడు నువ్వు కావాలని అనుకున్నా నీకు పెళ్ళి కాదు...” చిందులేసాడు పర్వతాలరావు.

పార్వతమ్మ “హవ్వ ... హవ్వ!” అని నోటిమీద అరచేత్తో కొట్టుకుంది.

బుచ్చిబాబు తల పట్టుకుని సోఫాలో కూర్చుండిపోయాడు.

---

“ఏంటా కాళ్లీడ్చుకుంటూ నడవడం తింగరి వెధవలా . అదిగో.... ఆ వచ్చేదే పిచ్చిక వారి యిల్లు... నువ్విలా కాళ్లీడ్చుకుంటూ రావడం చూస్తే నీ కిక్కడికి రావడం ఇష్టం లేదని అనుకుంటారు వాళ్ళు.....” ధుమధుమలాడ్తూ అన్నాడు పర్వతాలరావు బుచ్చిబాబుతో.

“వాళ్ళు అనుకునేదేంటి సిల్లీగా ...నాకు నిజంగానే ఇష్టం లేదు....” నసుగుతూ అన్నాడు బుచ్చిబాబు.

“నువ్విలా అతిగా వాగావంటే నీ నోరు నొక్కుతా సన్నాసెదవా-”

“తిట్టకండీ పాపం!... ఒరేయ్ నువ్వెందుకురా ఆయన్ని అనవసరంగా రెచ్చగొడ్తావ్?” అంది పార్వతమ్మ.

పిచ్చికవారి ఇంటిని సమీపించగానే లోపలి నుండి ఓ యువకుడు బయటికి పరుగెత్తుకుని వీళ్ళ ముగ్గురికి ఎదురొచ్చాడు.

“రండి..రండి... పెళ్ళికొడుకు మీరేనా?” అడిగాడు ఆ అబ్బాయ్ బుచ్చిబాబుని.

“కాదు నేను!” అన్నాడు పర్వతాలరావు గుర్రుగా చూస్తూ.

“హవ్వ!...హవ్వ!!” నోటిమీద చేత్తో కొట్టుకుంది పార్వతమ్మ.

“లేకపోతే ఏంటయ్యా.. పెళ్ళికొడుకు నేను కాదనీ...వాడనీ గుడ్డోడైనా చెప్తాడు. మళ్ళీ ఆ ప్రశ్న ఎందుకసలు?”

ఆ అబ్బాయ్ బిత్తరపోయి చూశాడు.

“నువ్వేం అనుకోకు బాబూ... ఆయన తీరే అంత!” అంది పార్వతమ్మ.

ఇంతలోకే పిల్లతండ్రి పిచ్చిక సుబ్బారావు ఇంట్లోంచి రయ్యిన బయటికి వస్తూ పర్వతాలు కాళ్ళమీద పడిపోయాడు.

“అబ్బో!...చాలా మర్యాదలు చేస్తున్నారు!” ముక్కున వేలేసుకుని సుబ్బారావు వంక అబ్బురపడి పోయి చూస్తూ ఆంది పార్వతమ్మ.

“సిల్లీ...హు!” అని మనసులో అనుకున్నాడు బుచ్చిబాబు.

పిచ్చిక సుబ్బారావ్ మోకాళ్ళకి అంటిన మట్టి దులుపుకుంటూ గల గలా నవ్వేశాడు.

“హబ్బే! ... అదేం కాదమ్మా!!... హడావిడిలో గుమ్మం కొట్టుకుని  బోర్లా పడిపోయా .. అంతే!” అన్నాడు.

“మీరు నిజంగా కాళ్ళమీద పడ్డారని అనుకోడానికి నేనేం వెర్రి వెధవని కాను కదండీ బావగారూ!” నవ్వుతూ అన్నాడు పర్వతాలరావు.

“అదీ నిజమేననుకోండి... హిహి! లోపలికి రండి బావగారు” అంటూ లోపలికి దారితీసాడు సుబ్బరావు.

వాళ్ళు అతన్ని అనుసరిస్తూ లోపలికి వెళ్లారు.

“కూర్చోండి బావగారూ... కూర్చోండమ్మా... కూర్చో బాబు....” హడావిడిగా చిందులేస్తూ వాళ్ళతో అన్నాడు పిచ్చుక సుబ్బారావు.

వాళ్ళు అక్కడున్న సోఫోలో కూర్చున్నారు.

“ఏమేవ్....” సుబ్బారావు లోపలికి చూస్తూ అరిచాడు.

అతను అలా అరవగానే అతని భార్య, ఇద్దరు కొడుకులు బయటికి వచ్చారు.

"ఈమె నా భార్యండీ బావగారూ పిచ్చిక మహాలక్ష్మి, వీడు నా పెద్ద కొడుకు పిచ్చుక రమేష్. వీడు నా చిన్న కొడుకు సురేష్..." వాళ్ళని పరిచయం చేశాడు.

వాళ్ళంతా నమస్కార ప్రతి నమస్కారాలు చేసుకున్నారు.

"మీరు ప్రతిసారీ పిచ్చిక అని మీ ఇంటి పేరు చెప్పనక్కరలేదు లెండి...వట్టి పేరు చెప్తే చాలు" అన్నాడు పర్వతాలరావు.

"బావగారు భలే జోకులేస్తారు!" అంటూ భళ్ళున నవ్వాడు పిచ్చిక సుబ్బారావ్-అతని భార్యా సుపుత్రులు ఘొల్లున నవ్వారు.

కాస్సేపు బుచ్చిబాబు ఉద్యోగం, జీతం, ప్రమోషన్ అవకాశాల గురించీ, ఇంకా ఆ మాటా, ఈ మాటా మాట్లాడిన తర్వాత స్వీట్లూ, హాట్లూ, పళ్ళూ అన్నీ తెచ్చి వాళ్ళ ముందు పెట్టాడు.

"అమ్మాయిని కూడా తీసుకురండీ!" అన్నది పార్వతమ్మ.

"అలాగేనమ్మా..." అని మహాలక్షితో "నువ్వు పిచ్చిక వరలక్ష్మిని తీసుకురా" అన్నాడు సుబ్బారావ్.

మహాలక్ష్మి లోపలికి వెళ్ళి ఓ ఏనుగులాంటి పిల్లని బయటికి తీసుకొచ్చింది. అ అమ్మాయే పిచ్చిక వరలక్ష్మి అని ఆ ముగ్గురికి అర్థం అయ్యింది.

"పిచ్చుక వారి అమ్మాయి పిడుగులా ఉందేంటి?" తల్లి చెవిలో గుసగుసలాడాడు బుచ్చిబాబు .

"అదే నేను చూస్తున్నా" తడారిపోయిన పెదాలను నాలుకతో తడుపుకుంటూ అంది పార్వతమ్మ.

"కూర్చోమ్మా!..." గుటకలు మింగుతూ పిచ్చుక వరలక్ష్మితో అన్నాడు పర్వతాలరావు.